మలుపు

ఘండికోట బ్రహ్మాజీరావు

1

రామకృష్ణయ్య సాయంకాలం షికారు నుండి తిరిగివచ్చాడు. కాళ్ళు కడుక్కుంటుండే అతని భార్య శ్రీదేవి చెప్పింది. "మీకోసం ఎవరో మళ్ళా వచ్చారు."

ఆ వచ్చిన అతను సూర్యారావు. నమస్కారాల తరువాత అతనిని తన గదిలోకి పిలిచి, కుర్చీ చూపించాడు రామకృష్ణయ్య.

"ఏం సూర్యారావ్! చాలకాలం తరువాత..."

"అవును మాస్టారూ! ... ఈ మధ్య తీరిక కొంచెమైనా దొరకడంలేదు. రానందుకు మరోవిధంగా అనుకోకండి."

"ఏమైనా కథలు వ్రాశావా?"

"అందుకోసమే వచ్చింది. ఈ ఉగాది పోటీకి పంపించాలని వ్రాశాను. మీరు వినిచేస్తేనాకు సంతృప్తి కలుగుతుంది."

"అయితే చదివి వినిపించు."

సూర్యారావు కవరులోని కథను పైకితీసి చదివి వినిపించాడు. రామకృష్ణయ్య చాలా శ్రద్ధగా విన్నాడు. కొంచెంసేపు ఆలోచించితన అభిప్రాయం వెలిబుచ్చాడు.

"సూర్యారావ్! సన్నివేశాలను హైదరాబాదు, విజయవాడలలో నడిపించావు. కాని అవి అతికినట్లులేవు. కథానాయిక నాయకుడి చిన్ననాటి స్నేహితురాలని చెప్పడానికి చాల శ్రమపడ్డావు. చివరకు పెళ్ళితో కథ ముగించావు. ఇటువంటివి ఎన్నో కథలు వచ్చాయి. మామూలుగా ప్రచురించడానికి అవకాశముండవచ్చు.

కాని పోటీలలో ఈ కథకు స్థానముండక పోవచ్చు.

''మాస్టారూ! మా దృష్టివేరు, మీ దృష్టివేరు. అందుకే మీకు వినిపించనిదీ కథ పంపదలచుకోలేదు. నాకెంతో బాగుంది. మా వాళ్ళందరూ విని చాలా బాగుందన్నారు...దయచేసి ఏ విధంగా మార్పుచేస్తే బాగుంటుందో చెప్పండి.''

"నీకు చాలా బాగా తెలిసిన ఊళ్లలో కథ నడుపు. భాష కొంచెం సరళంగా వ్రాయి. సన్నివేశాలలో కూడా మార్పు తీసుకొనిరా. నాయిక గురించి శ్రద్ధ తీసుకో. నాయకుడిలో ఆత్మవిశ్వాసం, నిజాయితీ చూపించు. చివరకు వారిద్దరూ పెండ్లాడడానికి పరిస్థితులన్నీ అనుకూలంగా ఉన్నా, నాయిక మనస్సు మరొక సామాన్యుని మీద ఉన్న సంగతి తెలుసుకొని, నాయకుడు స్నేహితునిగా వైదొలగాలని ప్రయత్నంచేస్తే, ఆమెకు నాయకుని యందు అనురాగం కలుగుతుంది. కథను ఇంతటితో ఆపితే పర్యవసానాన్ని పాఠకులే తమకు తోచినరీతి అన్వయించుకుంటారు,'' అన్నాడు రామకృష్ణయ్య.

సూర్యారావు నమస్కారంచేసి వెళ్ళి పోయాడు మరి కొంచెంసేపటిలో జగన్నాథం వచ్చాడు. ఇతని కథలు చాలాపత్రికలలో పడ్డాయి.

"నమస్కారం మాస్టరుగారూ! నా కథ ఒక్కసారి వినిపించి పోదామని వచ్చాను. రేపు సాయంకాలం పోస్టులో కథ పంపకపోతే పోటీకి అందదు."

జగన్నాథం చదివిన కథను రామకృష్ణయ్య చాలా శ్రద్ధగా విన్నాడు. దీనిలోని సమస్య దైనందినం కలిగేవాటి కన్న భిన్నంగా ఉంది. కథ చెప్పడంలో కొత్తదనంలేదు. పాత్రలు సహజంగా లేవు. సంభాషణలు లోకాన్ని మరామ్మత్తు చేయవలసిన ఉపన్యాసాలు. చివరకు సమస్యవిడదు. గిరిజనయువతిని ప్రేమించిన ఫారెస్టరు ఆమె తల్లిదండ్రులను ప్రార్థిస్తాడు, ఆమెను తనకిచ్చి పెళ్ళిచేయమని. కులంలోని పెద్దలు దానికి అంగీకరించరు. రహస్యంగా ఆమెను లేవదీసుకునిపోయి, తల్లి దండ్రులకు కొంతడబ్బు చెల్లించవచ్చునని కొందరు సలహా చెప్తారు. గిరిజనులను ఉద్ధరించి వర్ణాంతరవివాహం చేసుకొని ఆదర్శప్రాయుడు కాదలచిన ఆ ఫారెస్టరు ఇటువంటి పనికి అంగీకరించడు. అతని తరఫువారు, ఆమెతరఫు వారు ఉపన్యాసాలతో పాఠకుని బాధిస్తారు.

''జగన్నాథం! గిరిజనుల ఆచార వ్యవహారాలు బాగా తెలియందీ, ఈ సమస్యను చర్చించకూడదు. ఊహించడంతో కథ తయారుకాదు. కొండలతోను, వాటిపై నివసించే జనులతోను సన్నిహితసంబంధం కలిగి ఉండాలి. కనీసం అటువంటివారిని బాగా సంప్ర

దించి సందేహనివృత్తి చేసుకోవాలి పాఠకులచేక థచదివించాలని ప్రయత్నిస్తే దీనిని మార్చాలి. సంభాషణలు పరిమి తంగా ఉంచి, కొండల గురించి కొంచెం హెచ్చుగా వ్రాయాలి. కొత్తగా ఉద్యోగం దొరికిన ఫారెస్టరు శరీరసౌష్ఠవమున్న కొండదొరకూతుర్ని వశంచేసుకోవాలని ప్రయత్నిస్తాడు. తన శరీరంమీద చేయి వేయడానికి భర్తకు మాత్రమే అధికార ముందని, బలవంతం చేయడానికి ఏ ప్రయత్నం జరిగినా, మొలనున్న కత్తితో తన గౌరవాన్ని కాపాడుకోడం తెలుసునని ఆ కొండపడుచు చెపుతుంది. అధికారి కళ్లు విడతాయి. కాని కథలో బిగువేమీ కనిపించదు. రాజకీయాలు, సంఘ సంస్కారాలు కొండవాళ్ళ జీవితాలకు ముడిపెడితే, ఆ అమాయకులకు అన్యాయం చేసినట్లవుతుంది" అన్నాడు రామకృష్ణయ్య.

జగన్నాథం వెళ్ళిపోయాడు. రామ కృష్ణయ్య కూతురు వచ్చి తండ్రిని భోజ నానికి రమ్మంది. పట్టుపంచ కట్టుకొని అతను సిద్ధమవుతుంటే తాసిల్దారుగా రమ్మాయి విమల వచ్చింది. బంట్రోతును సాయం తీసుకుని.

"నమస్కారం మాస్టారూ!" అంది విమల.

"ఆశీస్సులు విమలా!" అన్నాడు రామకృష్ణయ్య.

"వేగమే వద్దామనుకున్నాను. కాని వ్రాస్తుంటే ఆలస్యమయిపోయింది"

"కథలు వ్రాస్తున్నావా విమలా?"

"అవును మాస్టారూ! మొదటి కథ మొదలుపెట్టాను. అది ఇప్పుడు పూర్త యింది. మీకుచూపించి పోటీకి పంపాలని అనుకుంటున్నాను."

"చాల సంతోషమయిన విషయం విమలా! నీ లోటి చదువుకున్నవాళ్ళు వ్రాస్తే, లోకం చాలా ఆదరంతో స్వీకరిస్తుంది."

"అవును మాస్టారూ! మా అమ్మ, స్నేహితురాండ్రు, అందరూ వ్రాయ మన్నారు. బియ్యే ప్యాసయినదానను ఆపాటి వ్రాయలేనా అని అనుకున్నాను. వారంరోజులై కొట్టుకుంటుంటే, ఒక పది పేజీలు మాత్రమే వ్రాయగలిగాను."

"విమలా! రచయిత కష్టాలు నీకు ఇప్పుడు తెలిశాయన్నమాట. అందరూ వ్రాయడం చాల సులువైన పని అనుకుంటారు."

"వ్రాసిన తరవాత లోతుతెలిసింది."

"కథ నే చదివేదా!"

"అదియింకా సాఫు వ్రాయలేదు. మీరు చదవడం కష్టమవుతుంది."

"అయితే చదివి వినిపించు."

విమల చదవడం మొదలుపెట్టింది. ప్రతీ రెండునిముషాలకు రామకృష్ణయ్య ముఖంలోకి చూచింది. అతను ఏదో పూనినవాడిలా, చైతన్యం లేనివాడిలా,



సమాధిలో ఉన్నవాడిలా కనుపించాడు. కథ పూర్తిఅయ్యేవరకు అతను ఈ లోకంలోలేడని ఆమెకనిపించింది. అంతా విన్న పది నిముషాలవరకు అతనేమీ మాట్లాడలేదు. అతని అభిప్రాయం వినడానికి ఆతృతపడుతున్న విమలకు ప్రతీనిముషం ఒక యుగమయింది. కొద్ది సేపటిలో ఆ నిశ్శబ్దం చీలిపోయింది.

"అమ్మాయ్! నువ్వు కథలు వ్రాయడానికి మరో పది సంవత్సరాలేనా పడుతుంది. అదేనా చాలా కృషి చేసిన తరువాత. ఈకథగురించి నాఅభిప్రాయం అడక్కుండా ఉంటేనే మంచిదేమో.

విమలముఖం వివర్ణమయింది.

"ఫరవాలేదు, చెప్పండి మాస్టారూ?" ఆమె ప్రాధేయపడింది.

"విమలా! నీకు తెలుగు వ్రాయడం తెలుసా? గ్రాంథికమేదో, వ్యావహారికమేదో తెలుసా? పాత్రలు, కథలో వారికున్న ప్రాముఖ్యత తెలుసా? ... ఏం చెప్పడం కోసం ఈ కథ వ్రాశావు? ఇందులో మొదలేది? ... పతాకస్థాయి ఎక్కడుంది?...ముగింపెక్కడ? సన్నివేశాలలో సహజత్వం ఏమేనా ఉందా? సమాజాన్ని ప్రతిబింబించే ప్రయత్నం కూడాలేదే... ఏ హృదయం కదలించడానికి, ఏ మనస్సును ఆనదింపజేయడానికి వ్రాశావు? కథ వ్రాయడంకన్న సులువైన పనిలేదని అనుకున్నావు. కథ వ్రాయడమంటే ఒక కళాఖండాన్ని సృష్టించడమన్నమాట మరచిపోయావు"

అతని మాటలలోని నిర్దాక్షిణ్యానికి విమలకు దుఃఖమొచ్చింది. కళ్లంట నీళ్లు తిరిగాయి మొదటి రచనా యత్నం విఫలమయినందున ఆమె అభిమానం దెబ్బతింది. రామకృష్ణయ్య ఊహా సౌధంనుండి క్రిందకు దిగివచ్చాడు. చీర చెరగుతో కళ్ళుఒత్తుకుంటున్న విమలను చూచేసరికి అతనికి తనుచేసిన తప్పు తెలిసివచ్చింది.

"సారీ! విమలా! ఆవేశంలో ఏదో అనేశాను. కథల విషయంలో చాలా సీరియస్‌గా మాట్లాడడం అలవాటయింది. ఇంతకీ ఇది నీ మొదటి ప్రయత్నం. మరేం అనుకోకు."

విమల మాట్లాడలేదు. మళ్ళా లోపలి నుంచి పిలుపు వచ్చింది. వడ్డించిన వంటకాలు చల్లారిపోయాయి.

రామకృష్ణయ్య టేబిలు డ్రాయరు లోంచి ఒక వ్రాతప్రతి తీసి విమల కిచ్చాడు.

"విమలా! ఈ కథ చదువుతుండు! నేను పదినిముషాలలో భోజనంచేసి వస్తాను,..." రామకృష్ణయ్య యింట్లోకి వెళ్ళిపోయాడు.

అతను భోజనంచేసి వచ్చేసరికి కొంతకాలం పట్టింది. అప్పటికి విమల ముఖంలో ఒక తేటదనం కనబడింది.

"కథ ఎలాగుంది విమలా?"

"చాలా బాగుంది మాస్టారూ, దీనిని ఏ పత్రికకూ పంపలేదా?"

"లేదు...ఈ మధ్య నా కథలను తిప్పి పంపుతున్నారు..."

"మరెందుకు వ్రాశారు?"

"అదేమరి...ఇదో వ్యసనం...... వ్రాయకపోతే నిద్రపట్టని పరిస్థితి ఏర్పడింది.

"మీకు అభ్యంతరం లేకపోతే ఒక విషయం అడుగుతాను. కోపంరాదు కదా!"

"అడుగు విమలా!"

"నా కీ కథయివ్వండి. పోటీకి న పేరున పంపుకుంటాను. మీ పేరు పంపితే వేసుకోడంలేదని మీరేఅన్నారు"

రామకృష్ణయ్య ఒక్కసారి చకిత దయాడు. అతను అనుకోలేదు, విమల ఇలా ధైర్యంగా అడుగుతుందని. తన భోజనానికి వెళ్ళినప్పుడు విమల ఆలో చించిన విషయమిదా!

"ఈ కథ గురించి చాల శ్రమ పడ్డాను. ప్రత్యేకమయిన శ్రద్ధతీసుకొని వ్రాశాను. భాష, భావం, శిల్పం...... వీటిలో కొత్తదనం చూపించాను. పాత్ర లలో జీవం పోశాను. జీవితంలో ఒక చోట తలుపు తెరచుకొని, దివ్యమయిన వెలుగొకటి కనబడి, తెలియకుండానే తలుపు మూసుకుంటుంది. ఆ వెలుగు మనస్సునుండి జారిపోకుండా నిలుపు కోవాలని ప్రతీపాఠకుడు తపిస్తాడు."

"మరి పోటీకి మీ పేరునే పంపించండి"

"నా పేరున పంపితే అది తిరిగి వస్తుంది. అప్పుడప్పుడు బహుమతులు వచ్చిన రచయిత కథకు అంత విలువ ఉండదు."

"అందుకోసమే నేను అడుగుతున్నది. నా పేర కథ పంపనీయండి"

అతను ఆలోచిస్తున్నాడు.

"రామకృష్ణయ్యగారు మంచిరచయిత లని లోకానికి తెలుసు. అందుచేత ఆయన పంపిన కథను కొంతమంది

చదవకుండా తిప్పిపంపవచ్చు. కాని విమలాదేవి ఎవరికీ తెలియదు. ఈ రోజులలో స్త్రీల రచనలకు ప్రోత్సాహం లభిస్తున్నది. మీ కథ వెలుగు చూడా లంటే యింతకన్న మంచి అవకాశం లేదు.''

రామకృష్ణయ్య కొంచెం తీవ్రంగా ఆలోచిస్తున్నాడు. విమల మాటలలో సత్యం లేకపోలేదు. నలుగురు చదివి ఆనందిస్తేనే కథ. లేనినాడు దానికి చిత్తు కాగితాలకు భేదమేముంది?

"మరో విషయం మాస్టారూ! నా పేరున కథ పంపితే బహుమతిరావచ్చు. అదృష్టంమీద ఆధారపడి ఉంది...అలా బహుమతివస్తే పేరు మాత్రమేనాది. ప్రతిఫలం మీది. మీరు ఎన్నో కథలు వ్రాయగలరు. ఒక కథ నాకిచ్చినందు వల్ల మీకేమీ లోటుండదు.''

రామకృష్ణయ్యఆలోచించాడు. విమల చెప్పింది చాల బాగుంది. తను కూడా అంత నిస్సంగికాడు. కళను కళ కోసం ఆరాధించే పిచ్చివాడుకాడు. పురుషార్థం దక్కుతుంది, కథను విమల కిస్తే.

"నువ్వు వయస్సులో చిన్నదానివైనా దూరాలోచన కలదానివి. ఇది నాకు అంత యిష్టంలేదు. అయినా తప్పదు. నా యింటి పరిస్థితులు కూడా బాగులేవు ఇది నేను నీకు చేసిన సహాయంకాదు. నువ్వే నాకు చేసినది. నేను కథను నీ

కివ్వడానికి అంగీకరిస్తున్నాను. ఈ విషయం నీకు, నాకుమాత్రమేతెలిసినది.

"చాలా థాంక్స్ మాస్టారూ! మీకు వాగ్దానం చేస్తున్నాను. ఈ విషయం మరెవ్వరికీ తెలియదు. కథ ప్రచురింపబడి ఏ బహుమతి దొరికినా, కనీసం మామూలుగా డబ్బువచ్చినా, ఎంత పెద్ద మొత్తమయినా, ఎంత చిన్నదైనా, మీకది విధిగా యిస్తాను."

"మంచిది విమలా!"

విమల వెళ్ళిపోడానికి లేచింది. రామకృష్ణయ్య డ్రాయరు తెరచి మరిరెండు కథల వ్రాతప్రతులు ఆమె కిచ్చాడు. వాటిగురించి కొంచెంసేపు చెప్పాడు.

"వీటినిచదువు. కథలెలావ్రాయాలో నీకు తెలుస్తుంది. వీటిని చదివి మళ్ళా నా కిచ్చేయ్. ఈరెండు కథలంటే నాకు చాలా అభిమానం మరచిపోకు విమలా!"

"చదివి నేనేతెచ్చి యిస్తాను మాస్టారూ... సెలవు తీసుకుంటాను."

విమల వెళ్ళిపోయింది. రాత్రిపదిన్నర అయింది. చలిగాలి వీస్తున్నది. లెక్కల మాస్టారు రామకృష్ణయ్య వీధి తలుపులు వేసుకొని పడక గదిలోకి వచ్చాడు. పిల్లలిద్దరూ కుక్కిమంచంమీద పడుక్కున్నారు. నల్లటి కంబళికి చింకి చీర జోడించి శ్రీదేవి వారికి కప్పింది.

పందిరిమంచంమీద ఒక పక్కకు తిరిగిన భార్యను చూచాడు ఆ కథక చక్రవర్తి. ఆమె చినిగిన రవిక వీపును బయటపెడుతోంది. దానిమీదజారుతున్న చీరపైటంచు మీద కుట్లు స్పష్టంగా కనిపిస్తున్నవి.

రచయితలలో ధనవంతులు మనదేశంలో లేరనే చెప్పుకోవాలి. ఉన్నా ఎక్కడో అరుదుగా ఉంటారు. చాల మంది రామకృష్ణయ్యవలెనే రచనను జీవితభృతికోసం అమ్ముకోకుండా, మరో పని చేస్తుంటారు.

ఉత్తమ మయిన ప్రపంచ కథా సాహిత్యమంతా పుక్కిటబట్టి, రచనా శిల్పంలోని మెలకువలు బాగా తెలిసి, సంభాషణా రచనలో సిద్ధహస్తుడై, మృదువైన హాస్యానికి పెట్టినపేరై, శైలి సౌకుమార్యంలో అగ్రగామియై, చదువరులను ఆనందసీమలకు కొనిపోయే రామకృష్ణయ్య నిత్యజీవితావసరాలకు కూడా యిబ్బంది పడుతున్నాడంటే అతిశయోక్తికాదేమో!

2

మాఘమాసంలో విమలకు పెండ్లయింది. ఎలమంచిలిలో కాలేజీ లెక్చరరుగా పనిచేస్తున్న శ్రీధర్‌కి ఆమెకి పెండ్లయింది. రామకృష్ణయ్య పెండ్లి పత్రికకోసం ఎదురు చూచాడు. బహుశా పెండ్లితొందరలో ఆడపెళ్ళివారు మరచిపోయారేమో! పెండ్లి అయిన మరునాడు బ్రహ్మాండమైన రిసెప్షను జరిగింది. కనీసం రిసెప్షనుకేనా విమలకు జ్ఞాపకం వచ్చి కబురు పంపవచ్చునని ఎదురు

చూడాదతను. ఒక్క హెడ్మాస్టరును తప్ప మరే మాస్టర్లను పిలువలేదు. రామకృష్ణయ్య మనస్సును సమాధాన పరచుకున్నాడు, తనను పిలిచి మిగిలిన మాస్టర్లను పిలువకపోతే బాగుండదు.

ఇంతలో స్కూలుఫైనలు పరీక్షలు వచ్చాయి. కుర్రాళ్ళకు లెక్కలుచెప్పడం పరీక్షలలో పర్యవేక్షకుడుగా పని చేయడంతో రామకృష్ణయ్యకు తీరిక దొరకలేదు. అనకాపల్లిలో ఎవరికీ బహుమతి వచ్చినట్లులేదు. వస్తే కనీసం పోస్టుమాస్టరేనా కబురు పంపించేవాడు. ఉగాదికింకా నాలుగు రోజులుందనగా ప్రత్యేక సంచిక వచ్చింది.

స్కూలులో డ్రాయింగు మాస్టరు ముందు కొన్నాడు సంచిక. ఉగాదికథల పోటీలో మొదటి బహుమతి శ్రీమతి విమలాదేవి శ్రీధర్ గెలుచుకుంది. ఆమె బియ్యేప్యాసయింది. భర్త ఎలమంచిలిలో కాలేజీ లెక్చరరుగా పనిచేస్తున్నారు. ఆమె కొన్ని వందల కథలు వ్రాశారు. కాని తన రచనమీద విశ్వాసం కుదరక, కథలు ప్రచురణార్హాలుకావని ఏపత్రికకు పంపలేదు. ఆమె వినయంగా తనకు కథ సరిగా వ్రాయడమే రాదని యిప్పుడు కూడా చెపుతున్నారు. మృదువుగా గీతాలను ఆలపించడం, తూలికతో ప్రకృతిని చిత్రించడం ఆమెకు హాబీలు.

"తాసిల్దారు గారమ్మాయి విమలే కదూ!" అడిగాడొకమాస్టరు.

"ఆ పిల్లే!......మరేం..." అర్థోక్తిలో ఆగిపోయాడు రామకృష్ణయ్య.

"ఏం, ఆగిపోయారేం?........."
డ్రాయింగు మాస్టరడిగాడు.

"మరేంలేదు... చూడండి ...... జగన్నాథానికిగాని, సూర్యారావుకిగాని ఏమైనా బహుమతులు వచ్చాయా?"

రెండవ బహుమతి హైదరాబాదులో ఒకరికి వచ్చింది. మూడవ బహుమతి కలకత్తాలో వారికి వచ్చింది. కన్సలేషను బహుమతులలో సూర్యారావు కొకటి వచ్చింది. జగన్నాథం కథ సాధారణ ప్రచురణ కెన్నుకోబడింది.

ప్రత్యేక సంచిక డ్రాయింగుమాస్టరు దగ్గిర తీసుకొని, క్లాసు పిల్లలను ఒక గంట ముందుగావదిలేసి, రామకృష్ణయ్య మొదటి బహుమతి పొందిన కథ 'మలుపు' చదవడం మొదలు పెట్టాడు. అందులో ఒక్క అక్షరంకూడా విమల మార్చలేదు. కేవలం రచయిత పేరు మాత్రం రచయిత్రి పేరుగా మారింది. ఒకసారిచదివాడు. రెండవసారిచదివాడు. మూడుసార్లు చదివాడు. పుస్తకంమూసి ఆలోచనలో పడ్డాడు. ఇన్నాళ్ళకు తన కథకో ఉత్తమస్థానం లభించింది. కళను గుర్తించి గౌరవించే స్వతంత్రాభిప్రాయాలు గల న్యాయనిర్ణేత లున్నందుకు సంతోషించాడు. తరువాత ఎవరినోటంటవిన్నా విమలాదేవి గురించి

ఆమె కథ గురించి పొగడ్తలు కురిసి పోయాయి.

ఇంటికి వెళ్లగానే శ్రీదేవితో ఈ సంతోషకరమైన విషయం చెప్పాలను కున్నాడు రామకృష్ణయ్య. రహస్యంగా విమలాదేవి వాగ్దానం గురించి కూడా చెప్పాలనుకున్నాడు. బహుశా ఆమె అర్థం చేసుకోలేదేమో? ...తన తెలివి తక్కువ తనానికి ఆమె విచారించవచ్చు. మొదటి బహుమతి తక్కువేమీకాదు... రెండువేల అయిదువందల రూపాయలు. కథ తన పేరను పంపి ఉంటే... దుర దృష్టవంతుడి కథ నెవరు చదువుతారు?

సాయంకాలం సూర్యారావు వచ్చాడు. రెండు ఆపిల్ పళ్ళు తీసుకొనివచ్చి రామ కృష్ణయ్య చేతిలో పెట్టాడు.

"మాస్టారూ! మీరు చెప్పిన ప్రకారం కథ మార్చి పంపించాను. రెండువందలు కన్సలేషన్ బహుమతివచ్చింది. ఇదంతా మీ చలవే" అన్నాడు సూర్యారావు.

రామకృష్ణయ్య మనసు ఆనందంతో నిండిపోయింది.

"ఇందులో నా గొప్పతన మేముందోయ్! ఏదో చిన్న సలహా!... కాని నాకు చాలా సంతోషమయింది మన వూరివారిద్దరికి బహుమతులు రావడం-మొదటి బహుమతి విమలకు- నీకు కన్స లేషను బహుమతి...నువ్వు ప్రయత్నిస్తే ఒకనాడు మొదటి బహుమతి వస్తుంది" అన్నాడు రామకృష్ణయ్య.

"మాస్టారూ?...మీదయఉంటే చాలు నంతే!......"

సూర్యారావు వెళ్ళిపోయాడు. జగ న్నాధం కూడా వచ్చి తన కృతజ్ఞత తెలుపుకున్నాడు.

ఆ సాయంకాలం ఆలస్యంగా చీకటి పడినట్లుంది రామకృష్ణయ్యకు. రాత్రి విమల, ఆమెభర్త వస్తారని నమ్మకంతో ఎదురు చూచాడు. వాళ్లారాత్రి రాలేదు. మర్నాడు కూడా రాలేదు. అలా ఉగాది వెళ్ళిపోయింది. తరువాత ఒక వారం, మరోవారం కూడా వెళ్ళిపోయాయి.

బహుశా విమల ఎవరికీ రహస్యం చెప్పలేదని రామకృష్ణయ్య అను కున్నాడు. ఈ విషయం చాల సున్నిత మైనది. భర్తతో చెప్పడానికి ఆమె సంకోచించి ఉండవచ్చు. ఆ రోజురాత్రి తనతో ఆమె చేసిన వాగ్దానం జ్ఞాపకం వచ్చి, మనస్సును సమాధానపరచు కున్నాడు. ఆవిడకు కలిగిన ఇబ్బందు లేమిటో! అవకాశం ఇంకా దొరకలేదు కాబోలు. లేకపోతే రాకుండా ఉంటుందా!

రెండవవారం నుండి వారపత్రికలలో పాఠకుల ఉత్తరాలలో మొదటిబహుమతి పొందిన కథకు ప్రశంసలు రాసాగాయి.

"చాలా కాలానికి తెలుగు పాఠక లోకానికి ఓ చక్కనికథ లభించింది."

"కథ చదివిన తరువాత, మనస్సు నొక దివ్యమైన కాంతి అలముకున్న ట్లుంటుంది."



"ఇందులో భాష, భావం, శైలీ.... అన్నీ ప్రత్యేకంగా ఉన్నాయి. రచయిత్రి చాలా ప్రజ్ఞాశాలిని ..."

"కథకు 'మలుపు' అన్న పేరు ఎందుకు రచయిత్రి పెట్టారో చివరకు తెలుస్తుంది. ఈ మలుపు అతి సహజంగా ఉంది..."

"చదివాను కథ రెండుసార్లు, మూడు సార్లు, ఎన్నోసార్లు... ... మనస్సును విడువకుండా ఉంది ఈ కథ..."

కథను, రచనాశిల్పాన్ని, మృదువైన భాషను, చక్కని శైలిని, ముగింపును చాలమంది మెచ్చుకున్నారు.

రామకృష్ణయ్య మనస్సులో బరువుగా నిలిచిన ఆశ రోజు రోజుకు క్షీణించ సాగింది. విమల ఏదైనా ఉత్తరమేనా వ్రాస్తుందేమోనని అతనుఎదురుచూచాడు. రెండు ఉత్తరాలు ఆమె చేసిన వాగ్దా నాన్ని జ్ఞప్తికి తెస్తూ వ్రాసి, పోస్టుచేసే వేళకు మనస్సు మార్చుకొని చింపి వేశాడు. అత్తవారింట్లో ఎవరిచేతిలో నైనా తాను వ్రాసిన ఉత్తరం పడితే. ఆ యింటికోడలిమీద లేనిపోని అను మానాలు బయలుదేరవచ్చు.

హైస్కూలులో పెద్ద పరీక్షలు వచ్చాయి వాటిలోపడి రామకృష్ణయ్య కొంతవరకు విమల గురించి మరచి పోయాడు. ఆలస్యానికి అతను మరి కారణాలు ఊహించలేకపోయాడు.

స్కూలు ఎండకాలం సెలవులకు మూసివేశారు. వైశాఖం వెళ్ళిపోయింది. జ్యేష్ఠం వచ్చింది. ఎండలు పెళ్ళుమని కాస్తున్నాయి. ప్రతీరాత్రీ రామకృష్ణయ్య ఆరుబయట వాలు కుర్చీలో కూర్చొని విమల ఎందుకు రాలేదో అని ఆలోచి స్తుండేవాడు. ఆఖరికి మరి ఆలోచించ డానికి శక్తిలేక, నిద్రలేని రాత్రులను గడుపలేక, ఒక ఆదివారం ఉదయం ఎలమంచిలి బయలుదేరి వెళ్ళడానికి నిశ్చయించాడు.

వేసుకున్నాడు. శ్రీదేవి కాఫీ, టిఫిన్ యిచ్చి పక్కనే నిలుచుంది.

"మధ్యాహ్నం భోజనానికి వస్తారా?" అడిగింది యిల్లాలు.

"ఎంత సేపు ... ఒక గంటపని... వెళ్ళడం ఒక గంట-రావడం ఒకగంట. భోజనం వేళకు తిరిగివస్తాను. పర్సు టేబిల్ మీద ఉంది. బస్సు ఖర్చుకి డబ్బులున్నాయో లేవో చూడు" అన్నాడు రామకృష్ణయ్య.

శ్రీదేవి పర్సులో డబ్బులు చూచింది. రూపాయ కొంచెం చిల్లర ఉంది.

"వెళ్లడానికి సరిపోతుంది." అంది శ్రీదేవి.

చాలు. అటునుంచి పరవాలేదు.'' అన్నాడు కొంచెం ధైర్యంగా రామ కృష్ణయ్య.

"ఎవరేనా శిష్యుడు కనిపిస్తాడనా! మన దగ్గిర ఉన్నది మనది... ఒకరిస్తా రన్నది మనను చేరేదాకా మనదికాదు.''

"అయితే నువ్వేచూడు..."

శ్రీదేవి పెట్లో వెదికింది. ఎక్కడా దొరకలేదు. పక్కింటి వాళ్లనడిగి అప్పు తెద్దామనుకుంది. టిఫిన్ తింటున్న కుర్రాడు, ఆడపిల్ల ముందుకొచ్చారు.

"ఎవరినేనా అడగడమెందుకమ్మా!" మా డబ్బీలలో దాచుకున్నవి నాన్న యిచ్చినడబ్బులే కదా! తీసుకోఅమ్మా!" అన్నాడు కుర్రాడు.

దక్కి వాళ్లవేపు చూస్తూఉండిపోయారు. పిల్ల తను దాచుకున్న డబ్బులలో ఒక అర్ధరూపాయి యిచ్చింది. కుర్రాడొక రూపాయి చిల్లర యిచ్చాడు. శ్రీదేవి ఆ చిల్లరనంతా జాగ్రత్తగా పర్సులో ఉంచింది.

రామకృష్ణయ్య బస్సులో కూర్చు న్నాడు. బయలుదేరడానికి కొంచెం వ్యవధిఉంది. అతనుఆలోచనలోపడ్డాడు. శ్రమ ఒకరిది....అదృష్టం మరొకరిది. విమల చాల అదృష్టవంతురాలు...రెండు వేల కథలలో ఆమె పంపిన కథకే బహుమానం రావడం ఊహించలేనిది. ఆ రచనకేదో చిన్నబహుమతి వస్తుందని అనుకున్నాడు ... కాని ... అందులో అంత విలువ ఉంది ... తన గొప్ప దనాన్ని గుర్తించింది లోకం ... రామ కృష్ణయ్యకు నవ్వొచ్చింది. అప్పుడే ఆలోచనలు తప్పుదారిన పడుతున్నాయి. కథలు తన వెవరూ తీసుకోడంలేదు.... తిప్పి పంపుతున్నారు ... విమలాదేవి కథను అంగీకరించి బహూకరించారు... అందులో నిజం ఆమెకు తెలుసు. తనకు తెలుసు...ఇవన్నీ ఇప్పుడు ఆలోచించినా ప్రయోజనంలేదు. ప్రస్తుతం ఆలోచించ వలసినది, ఆమె తన కెంత ప్రతిఫలం యిస్తుందని ... బహుశా ఆమె చేసిన వాగ్దానం ప్రకారం రెండువేల అయిదు వందలూ యివ్వదేమో... ఆమె భర్త

కూడా అంగీకరించక పోవచ్చు...... వాగ్దానం రహస్యంగా జరిగింది....కాని బహుమతి అందరికీ తెలిసివచ్చింది.... అందరూ ఆ డబ్బుఏమయిందని అడుగు తారు...బహుశా ఆమె డబ్బంతా యివ్వ లేదు...కనీసం వేయి రూపాయలిచ్చినా చాలును...అయిదువందలు పెట్టి యింటి పెంకు తిరగవేయించవచ్చు. మూడు వందలుపెట్టి కుటుంబాని కంతటికీ బట్టలు కొనుక్కో-వచ్చు. మిగిలినరెండు వందలతో వేసవిని హాయిగా గడపవచ్చు. బహుశా అంత కూడా ఆమె యివ్వ లేదేమో!...కనీసం అయిదువందలిచ్చినా చాలు. మూడువందలతోనే పడకగదిమీది పెంకు తిరగవేయించి అయిందనిపించ వచ్చు. మిగిలిన రెండువందలతో బట్టలు కొనుక్కో-వాలి ... ఇంట్లో అందరివి చినిగి పోయాయి. లేనిపోని ఆశలకు పోకుండా ఉంటే మంచిది. ... ఆఖరుకి ఎంతలేదన్నా ఒక వందరూపాయలకు లోటుండకూడదు. అదే తను ఆశించిన ప్రతిఫలం... మిగిలినవంతు అదృష్ట వంతురాలిది.

ఈ ఆలోచనలతోపాటు బస్సు ప్రయాణంచేసి ఎలమంచిలి చేరుకుంది.

లెక్చరరు శ్రీధర్‌గారిల్లు వెతుక్కో-డానికి అట్టేకాలం పట్టలేదు.

"మొదటి బహుమతి వచ్చిన విమలా దేవిగారిల్లా!...స్టేషను వెనుక...ఎడమ

చేతి పక్క వీధిలో...చివారిమేడ...అదే వారిల్లు!'' ఎవరో చూపించారు.

ఆ యిల్లు పెద్దది వీధిలో సావడి విశాలంగా ఉంది. దానికి యినుప కట కటాలున్నాయి. రెండు మూడు చిన్న బెంచీలున్నాయి. ఎండ కొంచెంముదిరింది వస్తూవస్తూ, ఆత్రుతలో గొంతుకకేదో అడ్డుపడినట్లుతోచి, ఒక సోడా త్రాగి వచ్చాడు రామకృష్ణయ్య.

ఆ పెద్ద యింట్లో ఎంతమందో ఉన్నట్లు లేదు. పనిపిల్ల ఒకతె యిల్లు ఊడుస్తుంది. బహుశా విమల, మొగుడు మేడమీద ఉన్నారు కాబోలు. ఆదివారం అతనికి కూడా సెలవులే...... కొత్త దంపతులు...

"ఓ పిల్లా! అమ్మగారు లేచారా?" అడిగాడు రామకృష్ణయ్య పనిపిల్లను.

"ఏయమ్మగోరు?... కథలురాస్తారే ఆరా...నేక ఆరి అత్తమ్మగోరా?" పని పిల్ల అడిగింది.

పనిపిల్లకు కూడా తెలుసు విమల కథలు వ్రాస్తుందని ... ఈ సంఘంలో కథా రచయితకు ఎంతగౌరవమైన స్థానం!

''కథలు వ్రాస్తారే... ఆమె ...... విమలమ్మగారు"

"ఆరా!...యిప్పుడే నెగిసినారు,.."

"అయితే చిన్న ఉపకారంచేద్దూ! పనిపిల్ల దగ్గిరికి వచ్చింది.

"అనకాపల్లినుంచి రామకృష్ణయ్య మాస్టారు వచ్చారని చెప్పు...అంతే ... అంతేచాలు" అన్నాడు రామకృష్ణయ్య. తడబడుతూ!

"అలానే. మీరిక్కడ కూసోండి. అమ్మగోరు తానమాడిన తరువాత సెపతా కూసోండి..."

మూలనున్న బెంచీమీద రామ కృష్ణయ్య కూర్చున్నాడు.

ఇల్లూడ్చే పనిపిల్ల లోపలికి వెళ్ళి ఎప్పటికీరాదు. అమ్మగారు స్నానమాడేరో లేదో, పిల్ల చెప్పడం మరచిపోయిందో రామకృష్ణయ్య లేస్తున్నాడు. ఇంట్లోకి చూస్తున్నాడు, తిరిగివచ్చి బల్లమీద కూచుంటున్నాడు. పనిపిల్ల లోపల తిరుగుతున్నది. తొమ్మిది దాటింది. ఎండ అప్పుడే ముదురుతోంది,

ఒక లావుపాటి ఆయన, ఒక బక్క పలుచని అతను ఎటాచీకేసులు పట్టుకొని వచ్చారు. వాళ్లను తను చూచినట్లులేదు. వాళ్ళు తనలాగే లోపలికి చూచి పని పిల్లను బయటికి పిలిచారు.

"చూడు! అమ్మీ! విమలాదేవిశ్రీధర్ గారున్నారా?" వలంపటి ఆయన అడిగాడు.

"అంటే...కథలురాసే అమ్మగోరా! ఆ పిల్ల అడిగింది.

''దటీజ్‌రైట్! ఆమే!..."అన్నాడు పలుచని ఆయన.

"ఉన్నారు"

"అయితే ఈ రెండు విజిటింగ్ కార్డులు అమ్మగారికిచ్చిరా! మేము నీ కోసం ఎదురుచూస్తుంటాం. ఎంతవేగం వస్తే అంతబహుమానం! చూడు నాచేతిలో ఏముందో? ..." ఆ వలంపటి ఆయన కొత్తరూపాయినోటు గాలిలో ఆడించాడు.

పనిపిల్ల చెంగునదాటి లోనికిపోయి, కళ్ళుమూసి తెరచేలోపుల వచ్చిపడింది జాపోస్తూ!

"అమ్మగారు యెంటనే రమ్మన్నారు. మేడమీద కథలురాసే గదిలో కూసున్నారు...నా యెంటే రండి..." అంది ఆ పిల్ల లోపలికి దారిచూపిస్తూ.

రామకృష్ణయ్య వేపు అనుమానంగా చూస్తూ, జోళ్లు విడిచి వాళ్ళు లోపలికి వెళ్లారు. ఆ లెక్కల మాస్టరు జేబుతడవుకున్నాడు పర్సు బరువుగా తగిలింది. అప్పుడతనికి జ్ఞాపకంవచ్చింది. దానిలో పిల్లలిద్దరూ యిచ్చిన చిల్లరనాణాలున్నాయని, ఏ మాత్రం ఆ పిల్లకు బహుమతి చేస్తే, తిరుగు ప్రయాణానికి సరిపడవని, ఆ వచ్చిన వాళ్ళకు తనకు భేదముంది. తను ఈనాటి విమలాదేవి కీర్తికి మూల కారణం. ఆవిధంగా ఆమె సంపదకు కూడా సహాయం చేసినవాడు. మరి వాళ్లెవరు! బహుశా ఆమెకు తనకంటే ఆత్మీయులై ఉంటారు. లేకపోతే తనను పిలవడంమాని వారినెందుకు పిలుస్తుంది.

పనిపిల్ల హంగామాగా వెళ్తున్నది వీధిలోకి. ఆమె చేతిలో ఫ్లాస్కు, రెండవ చేతిలో సంచీ. ఒక పావుగంట తరవాత హోటలునుండి పొట్లాలు. ఫ్లాస్కునుండి కాఫీయో టీయో పట్టుకొని వస్తున్నది.

"ఓ పిల్లా! నా సంగతి అమ్మగారితో చెప్పావా?" ఎదురుగా పోయి రామకృష్ణయ్య అడిగాడు.

"సెప్పినాను. అమ్మగోరు యేమీ జవాబు సెప్పనేదు."

"ఎవరీ వచ్చినవాళ్ళు?"

"నాకేం తెలుసు. డబ్బున్న మా రాజులు. పుత్తకాలు యేయించేవోరొకరు కథలు రాయించేవోరొకరు" అంటూ పనిపిల్ల లోపలికి వెళ్ళిపోయింది.

రామకృష్ణయ్యకు ఒళ్లల్లా చెమట పట్టింది ఒక్కసారి. మనసు, శరీరం ఏమీ పనిచేయలేదు. తిన్నగావచ్చి మూలనున్న బెంచీమీద కూచున్నాడు నిర్మించుకుంటున్న ఊహాసౌధాలను ఒకటి ఒకటి కూలదోయడం ఆరంభించాడు.

ఎంతసేపయిందో...ఏవో నవ్వులు ...బహుశా విమలకూడా వాళ్ళను సాగనంపడానికి వస్తుంది...రామకృష్ణయ్య లేచి నిలబడ్డాడు...ఆమె చూపులలో పడడానికి సమయం ఆసన్నమయిందని తొట్రుపడ్డాడు. ఆమె మేడదిగి రాలేనట్టుంది. ఆ యిద్దరు కొత్తవాళ్ళె వచ్చి ద్వారం పక్కనున్న బెంచీమీద సావకాశంగా కూచున్నారు.

"ఓ అమ్మీ! ఓ రిక్షాతీసుకురా!" వలంపటి ఆయన అన్నాడు.

"శానదూరం పోవాలా...నా వొల్ల కాదు..."

"ఇగిగో చూశావా, కొత్తపావలా! ..." ఈసారి పలుచని అతను ఎర చూపించాడు.

పనిపిల్ల పీధిలోకి వెళ్ళింది.

వలంపటి ఆయన సిగరెట్టు ముట్టించి అన్నాడు:

"ఆమెకు బహుమతి వచ్చిన ధనం ఏంచేసిందో?"

"మీకు తెలీదా?...ఆ ప్రశ్నకూడా నా యింటర్వ్యూలో అడిగాను. ఆమె మెడలోని పొళ్ళనెక్లెసు చూపించింది, నోటితో జవాబీయకుండా..." అన్నాడు పలుచని అతను.

"అందమైన రచయిత్రి విమలాదేవి ..."

"ఆమెకన్నా చక్కనివి ఆమె రచనలు. ఆమె అంతఃసౌందర్యాన్ని అవి చూపిస్తాయి."

"కాని యిప్పటికామె వ్రాసినవి మూడే కథలు..."

"పొరపాటుపడుతున్నారు ... ఆమె వందల కథలు వ్రాశామన్నారు...కాని పత్రికలలో ప్రకటింపబడినవి మూడు మాత్రమే...అయితేనేం మూడూ మూడు రత్నాలే..."

"పత్రికలలో వచ్చిన కథలు వేస్తేనే మంచిదనిపించింది...మరో రెండునెలల్లో ఇంకో అయిదు కథలు వస్తాయి. కథా సంకలనానికి ఇప్పటినుంచీ పబ్లిసిటీ యివ్వడానికి పిలుంది...కనీసం అయిదు వేల కాపీలేనా అమ్ముడుపోకపోతే పెట్టుబడి రాబించదు."

"జంబునాధంగారూ? మీకా భయమేమీ అక్కర్లేదు. మొదటి ఎడిషన్ వచ్చిన రెండు నెలలకే మరొకటి వేయవలసి వస్తుంది."

"అందుకోసమే ఆమె కోరిన వేయి రూపాయలు ముందుగానే చెల్లించాను..."

"మీరు చేసినపని చాల దూరాలోచనతో చేసింది...ఆమె రచనలన్నిటినీ మీరు లోకానికి అందించవచ్చు..."

"ఇంతకీ ఆమె వ్రాసిన రెండో కథా మూడవ కథ నేను చదవలేదు. మీరు చదివారా వెంకట్రావుగారూ?..."

"చదివాను...చాలసార్లు చదివాను.."

"రిషా వచ్చేదాకా చెప్పండి..."

"రెండో కథ...ఒక వయసు మళ్ళిన ముష్టివాడు రోజూ బిచ్చమెత్తుకుంటాడు. యి ల్లా లు చాల ఉత్తమురాలు... కాదనకుండా బిచ్చం వేసేది. కలిగినప్పుడు చారో పులుసో పోసేది. ఆదరించి కష్టసుఖాలు అడిగేది. ఆవిడ మొగుడు చాల అనుమానంగల మనిషి. ఒకరోజు మొగుడి కొత్త ఖద్దరు పంచ పీధిలో తీగమీద ఎండకేస్తుందావిడ-బిచ్చానికొచ్చిన ముష్టివాడు ఆ పంచ చక్కదనాన్ని మెచ్చుకొంటాడు. ఎవరేనా ఎత్తుకుపోగలరని, తీసి దాచేయ



మని ఆ యిల్లాలితో చెప్తాడు. ఆమె బిచ్చంవేసి యింటిలోకి పోయింది. ఆ పంచెవంకే కొంచెంసేపుచూచి వాడు కూడా వెళ్ళిపోతాడు. మరునాడు ముష్టి వాడు వచ్చేసరికి యింట్లో గొడవ జరుగు తున్నది యిల్లాలిని చావగొడ్తున్నాడు భర్త. అడ్డమయిన వాళ్ళను నెత్తి కెక్కించుకుంటుందని, ముష్టివాడు తన క్రొత్త ఖద్దరుపంచ ఎత్తుకుపోడానికి ఆమెయే కారణమంటాడు. ఆమెతింటున్న దెబ్బలు మరి చూడలేక చల్లగా అక్కడ నుంచి వెళ్ళిపోతాడు. బిచ్చమెత్తడం మానేసి ఆ యిల్లాలిని ఎలా ఆపదనుంచి తప్పించాలని ఆలోచిస్తాడు. చివరకొక నిర్ణయానికి వస్తాడు. తాను చాల కాలం నుండి ప్రాణపదిలంగా జమచేస్తున్న చిల్లర డబ్బులన్నీ లెక్కపెడితే ముప్పై రూపాయలవరకూ అయింది. సాయం కాలం ఖద్దరు దుకాణంలో, అచ్చంగా అటువంటిపంచ, అత్తాకోడలు అంచుది, దొరుకుతుంది తన డబ్బుకు. దానిని జాగ్రత్తగా పట్టుకొచ్చి, యిల్లాలిని మెల్లిగా పిలుస్తాడు. బుద్ధిగడ్డితిని పంచ ఎత్తుకుపోయానని, అయ్యగారు కొట్టిన దెబ్బలకు ఆమె పడిన బాధ చూడలేక పోయానని, తనను క్షమించవలసిందని చెప్పి ఆ కొత్త పంచ ఆమె చేతిలోపెట్టి, తిరిగి చూడకుండా, ఆ యింటితో తన సంబంధాన్ని పూర్తిగా తెంపుకొని, వెళ్లి పోతాడు. ఆమె పంచను లోపలికి తీసు కెళ్ళి దీపం వెలుతురులోచూచి, ఆ పిలు పందని బిక్షగాడిని పిలుస్తుంది, 'ఓ అబ్బీ. పంచె అంచుమీద మావారిపేరు కుట్టాను. దీనిమీద అటువంటిదేమీలేదు. ఇది మాదికాదు నాయనా!...'

"అద్భుతంగా ఉంది!..." యిల్లాలి అమాయకత్వం, ముష్టివాని మహాత్యాగం మనస్సుకు కరుణతో అభిషిక్తం చేస్తాయి.

ఆమె నడిగాను. ఈ కథకు ఏ సంఘటన మూలమని? ... ఒకసారి వీధిలో కలకల మయింది. కాసమనిషి కల్లాపుజల్లుతూ అక్కడపెట్టిన చెంబు మాయమయిపోయింది. అడుక్కోడానికి

వచ్చిన ముష్టివాడిని అనుమానించి చావ గొడతారు...ఈ దృశ్యం ఆమె మనస్సులో నిలిచిపోయింది. లోకంలో ఎందుకూ కొరగాని బిచ్చగాళ్ళకు కూడా మనసుందని, నైతిక సంపద ఉందని నిరూపించారు విమలాదేవిగారు."

"మూడోకథ?..."

"అదీ అటువంటిదే ఓ వయసులోనున్న పనిమనిషి...ఆమెపై మరులుకొన్న యింటియజమాని ... భర్తను అర్థంచేసుకొన్న యిల్లాలు. పనిమనిషి వచ్చిన తరువాత యజమానిలో కలిగిన మార్పులు గమనించిన యిల్లాలు, అతని కోరిక తీరడంకోసం ఒకనాడు అనుకోకుంటా పుట్టింటికి వెళ్ళిపోతుంది ఆ పనిమనిషి మాత్రం ఆ యజమానికో మంచి పాఠం చెప్పి, ఆ విడిపోతున్న దంపతులను దగ్గిరగా తీసుకొస్తుంది. నాకింకా ఆ కథలోని మొదటి వాక్యాలు గుర్తున్నాయి...'అమ్మగారు మంచివారు... అయ్యగారు మంచివారు. వారి మనస్సులలో పొరపొచ్చాలులేని రోజులలో ఆ యింట్లో ఆనందం తాండవించింది. కొత్త పనిమనిషి వచ్చిన కొద్దిరోజులలో ఆ ఆనందం లోపించినట్లయింది. అమ్మగారి ముఖంమీద చిరునవ్వు కనిపించినా, లోపలి విచారరేఖలు బయలుపడేవి...' అలా కథ నడుస్తుంది. చివరకాయిల్లాలు భర్త కోరుకుంటున్న స్వర్గం దూరం చేయడానికి యిష్టంలేక, ఒకనాటి మధ్యాహ్నం పుట్టింటికి వెళ్ళిపోతుంది. ఆఖరున అయ్యగారిని, అమ్మగారని అర్థంచేసుకున్న ఆ వయసులోని పనిమనిషి అంటుంది. 'బాబుగోరూ!... ఒక్కసంగతి గమనించినారా!...తమరి గోరి సుఖంకోసమే ఉన్నట్టుండి అమ్మగోరు యెళ్ళిపోయినారు. తమరు నా వొంటిమీద సేయియేయాలని తొందర పడుతున్నారు. అమ్మగోరికి అన్యాయం సేస్తున్నట్టుకూడా అనిపించనేదా?...నా వొంటిదానికే కట్టంగా ఉందే...నాకేం . మూడోమనువుదానిని. తమకు సుకమిస్తే నాకో నాలుగు డబ్బులు దొరుకుతాయి. కానీ బాబుగోరూ!...నేను యీనాడుండి రేపు పోవాలసినదాన్ని...పోతూ పోతూ మీ కుటుంబాన్ని యిడదీసి, ఎప్పుడు నవ్వే అమ్మగోరి ముఖాన నిప్పోసి పొమ్మంటారా?"

"ఈ కథలోకూడా విమలాదేవి ఎంత ఉదాత్తతగా వ్యవహరించారు! చెడిన పనిమనిషిలో ఒక సంసారాన్ని నిలబెట్టే మంచి కోరిక కలిగించి, పాఠకుల మనస్సులలో చెరగని ముద్రవేశారు."

"ముష్టివాళ్ళందరూ దొంగలని, వయసులోని పనిమనుషులు వ్యభిచారిణులని అందరూ సాధారణంగా తీర్మానిస్తే, ఈమె వాళ్ళను దేవతలుగా మలచారు."

"రచయిత్రికి ఉజ్వల భవిష్యత్తుంది."

"రాబోయే పత్రికలో 'విమలాదేవితో

ఇంటర్వ్యూ' చదివి మీ అభిప్రాయం వ్రాయండి."

"తప్పకుండా! ... మరి!. కథల సంపుటి పరిచయానికి కూడా అది పనికి వస్తుందిగా!"

"జగన్నాథంగారూ! మీ వ్యాపార సరళికి నమోవాకాలు...లాభంలేనిది ఏ పని చెయ్యరుకదా..."

ఇద్దరూ నవ్వుకున్నారు. వీధిలో ఉన్న రిక్షామీద వెళ్ళిపోయారు.

అంతా వింటున్న రామకృష్ణయ్యకు మతిపోయినట్లయింది. లోకం తిరుగుతున్నట్లనిపించింది. వడగాడ్పు వీచడం మొదలయింది. బయటి తాపానికి హృదయంలో జ్వలిస్తున్న అవమానాగ్ని తాపానికి అతను తట్టుకోలేకపోయాడు. తాను చెప్పిన ప్రతీ అక్షరం విమలాదేవి విక్రయించింది. తన రెండు కథలను తనకు కాకుండా చేసింది.

పనిపిల్ల బయటికి వచ్చింది.

"ఓ పిల్లా! కథలు వ్రాసే అమ్మగారికి నా సంగతి జ్ఞాపకం చెయ్యి" కోపంగా, విసుగ్గా అన్నాడు రామకృష్ణయ్య

అతని ముఖంలోకి కొంచెంసేపుచూచి పనిపిల్ల లోనికి వెళ్ళింది. అనుకున్నంత తొందరలో రాకపోయినా మరోపది నిముషాలలో వచ్చింది.

"అమ్మగారు రమ్మని పిలుస్తున్నారా? ఆతృతతో అడిగాడు రామకృష్ణయ్య.

"ఏం నేదు...ఈయాల అమ్మగోరికి నలతగా వుందట నిన్ను సూడ్డానికి తీరదని అమ్మగోరు సెప్పారని అయ్యగోరన్నారు."

పనిపిల్ల లోపలికి వెళ్ళిపోయింది.

విమలాదేవి, ఆమె భర్త శ్రీధర్ అలా ప్రవర్తిస్తారని రామకృష్ణయ్య కలలోకూడా అనుకోలేదు. ఈ ఊహించని అవమానానికి తట్టుకోలేకపోయాడు లేచినిలబడితే కాళ్ళు వణికాయి వడిగా అడుగులు వేసుకుంటూ స్టాండ్ కుపోయి, బస్సులో కూచున్నాడు.

బస్సు బయలుదేరింది. కండక్టరు డబ్బులడిగాడు. చిల్లర అంతా అతని చేతిలోపోస్తే, వింతగా రామకృష్ణయ్య ముఖంలోకిచూచి, లెక్కబెట్టుకున్నాడు. సరిగా టిక్కెట్టు సొమ్మంది. బస్సులో అవమానం పాలుబడకుండా రక్షించిన పిల్లలను, భార్యను తలుచుకునేసరికి అతని కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

ఆ బీదరచయిత కోపం తాటాకు మంటలా చల్లారిపోయింది. అతని గుండెలలో పేరుకున్న ఆశ పూర్తిగాపోయి, హృదయం తేలికపడింది.

పుస్తకాలవ్యాపారి వెళ్ళిపోతూ అన్న మాటలు అతనికి జ్ఞాపకం వచ్చాయి.

"నాలుగోకథ మలుపు ఎలా వుంటుందో చూడాలి."

అంత ఉదాసీనతలోను రామకృష్ణయ్య పెదవులమీద నొక స్వచ్ఛమైన చిరునవ్వు విరిసింది.